సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అటవీ సిబ్బందిపై దాడి దారుణం



కంబాలకొండలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అటవీశాఖ సిబ్బంది

ఆరిలోవ: శ్రీశైలంలో అటవీ శాఖ సిబ్బందిపై జరిగిన దాడిని ఖండిస్తూ శనివారం కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో అటవీ శాఖ విశాఖపట్నం డివిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉద్యోగులపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్న అటవీ ఉద్యోగులపై శ్రీశైలం ఎమ్మెల్యే అనుచరులు దౌర్జన్యం చేసి దుర్భాషలాడడం దారుణమని అసోసియేషన్ సభ్యులు మండిపడ్డారు. భౌతిక దాడులకు దిగడం హేయమైన చర్య అని ఖండించారు. ఈ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు జరిగితే ఉద్యోగాలు చేయడానికి భయపడాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బి.రాజు, సభ్యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి తెన్నేటి పార్కు బీచ్‌లో శనివారం సాయంత్రం గుర్తు తెలియని మహిళ మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. సందర్శకుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు బీచ్‌కు చేరుకుని మహిళ మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని మహిళగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆమె వయసు 45 నుంచి 50 సంవత్సరాలు మధ్య ఉంటుందని భావిస్తున్నారు. ఆమె బంధువులు ఎవరైనా ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

దత్తత గ్రామాల అభివృద్ధికి చర్యలు



సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో దత్తత గ్రామాల ప్రతినిధులతో ప్రొఫెసర్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య జేమ్స్ స్టీఫెన్ సమావేశ అంశాలను తెలిపారు. దత్తత తీసుకున్న పినగాడి, గొరపల్లి, రాంపుర, కరకవానిపాలెం, కోటవానిపాలెం గ్రామాల ప్రతినిధులను సమైక్యపరచి ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ హెల్ప్‌లైన్ గ్ ప్యాండ్ వివరాలు తెలియజేశారు. పరస్పర సహకారం అందించుకుని, అభివృద్ధి చేసే అంశాలపై చర్చించారు. గ్రామ పెద్దలు, నాయకులు ఇప్పటి వరకు అంబేడ్కర్ చైర్ చేపట్టిన కార్యక్రమాలను అభినందిస్తూ, భవిష్యత్ కార్యాచరణకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు. రాజకుమార్, ప్రవీణ్ సమన్వయంతో సమావేశం విజయవంతంగా నిర్వహించారు.

గెడ్డలో చెత్త తొలగింపు



ఆరిలోవ కాలనీలో చెత్త తొలగించిన తర్వాత గెడ్డ

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి 40 గజాల కాలనీలో గెడ్డలో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య సిబ్బంది శనివారం తొలగించారు. ఇక్కడి గెడ్డ ఆంధ్ర పెద్ద మట్టి దిబ్బ ఉండటం వేలాదుతున్నాయి. కొన్నాళ్లుగా ఆ ఊడలు గెడ్డలో గెడ్డలో కాకుండా నిలిచిపోవడంతో మురుగు నీరు కిందకు పోవడానికి అడ్డంకిగా మారాయి. దీంతో పైనుంచి మురుగు నీటి తోపాటు వచ్చిన చెత్త ఇక్కడ పేరుకుపోయి దోమలకు నిలయంగా మారింది. మరోవైపు దుర్వాసన భరించలేక స్థానికులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 20న 'చెత్త కుండీలా గెడ్డ' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు వార్డు కార్పొరేటర్, పారిశుధ్య అధికారులు స్పందించారు. పారిశుధ్య కార్మికులతో ఈ గెడ్డలో అడ్డంకిగా ఉన్న మర్రి ఊడలను తొలగించారు. నిండిపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేశారు. దీంతో కార్పొరేటర్, పారిశుధ్య సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అప్రమత్తతే ఆరోగ్య రక్ష

- ఇటీవల వర్షాలతో పెరుగుతున్న జ్వరాలు
- విమ్స్, ఏరియా ఆస్పత్రులకు రోగుల క్యూ
- మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



విమ్స్‌లో ఓపీ కోసం నిరీక్షిస్తున్న రోగులు

ఆరిలోవ: ఇటీవల కురిసిన వర్షాలతో జ్వర పీడితులు పెరిగిపోతున్నారు. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్‌తో బాధపడుతూ నియోజకవర్గంలోని విమ్స్, ఏరియా ఆస్పత్రులకు బాధితులు క్యూ కడుతున్నారు. సహజంగా వర్షాకాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధులు విజృంభిస్తుంటాయి. దీంతో ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాల్సిందే. వైద్యాధికారులూ ప్రజలను అప్రమత్తం చేస్తూ జ్వరాలు బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గంలో జ్వరాలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఆస్పత్రుల్లో జ్వర బాధితులతో రద్దీ కనిపిస్తోంది. నియోజకవర్గ పరిధిలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్), ఆరిలోవలోని జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ ఆస్పత్రి (ఎఫ్‌ఆర్‌యూ), ఆరిలోవ, ఐసుకతోట, పెదవాల్తేరు ప్రాంతాల్లో ఉన్న యూపీహెచ్‌సీలకు జ్వర బాధితుల ఓపీ కొద్ది రోజులుగా పెరుగుతోంది. విమ్స్‌లో రోజువారీ ఓపీలో 30 నుంచి 40 మంది జ్వరాలతో బాధపడుతున్న వారే ఉంటున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం 15 మంది ఇన్ పేషెంట్లు విమ్స్‌లో ఉన్నారని వైద్యులు తెలిపారు. యూపీహెచ్‌సీలలో రోజుకు 20 మంది వరకు జ్వర బాధితులు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. సాధారణ జ్వరాలతోపాటు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, డయేరియాను గరికాకుండా ముందు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరముందని వైద్యులు సూచిస్తున్నారు.

వాతావరణ మార్పులతో ఇబ్బందులు

వర్షాకాలం కావడంతో ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల సంభవించే సాధారణ వ్యాధుల తోపాటు కలుషిత నీరు, అపరిశుభ్రం వల్ల మరిన్ని వైరస్‌లు దాడి చేస్తుంటాయి. నగరంతోపాటు నియోజకవర్గంలో ఇప్పటికే జ్వరాలతో చాలా మంది మంచానపడ్డారు. ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రాణాల మీదకొచ్చే ప్రమాదం ఉంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటేనే వైరస్‌లను తరిమి కొట్టే అవకాశం ఉంది.

పరిశుభ్రత లేకుంటే ప్రమాదమే

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయి. అపరిశుభ్ర వాతావరణంతో దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు, నీటి కాలుష్యం వల్ల సంభవించే డయేరియా విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. నియోజకవర్గ పరిధి ఆరిలోవ కాలనీ, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక కొండవాలు ప్రాంతాలు, జోడుగుళ్లపాలెం, జాలరిపేట, అప్పూఘర్, పెదవాల్తేరు, వెంకోజీపాలెం, ఐసుకతోట, కేఆర్ఎంకాలనీ, శివాజీనగర్, చాకలిపేట తదితర ప్రాంతాల్లో జ్వర పీడితులు అధికంగా ఉన్నారు. ఇప్పటికే ఇళ్లలో మంచాన పట్టిన వారు కొందరుండగా ఇంకొందరు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వీరి కోసం వైద్యాధికారులు వైద్య శిబిరాలు నిర్వహించడం, వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం చేస్తుండాలి. ప్రజలు ఆహారం, పరిశుభ్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆస్పత్రుల్లో నిరంతరం వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉంచాలి.

బాలింతలు జాగ్రత్తగా ఉండాలి



సీజనల్ వ్యాధులతో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా బాలింతలు, గర్భిణులు, వృద్ధులు, పిల్లలు మరింత అప్రమత్తంగా ఉండాలి. దగ్గు, జలుబు, జ్వరం వస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలి. అవసరమైతే రక్త పరీక్షలు చేయించుకోవాలి. బాలింతలు, గర్భిణులు ప్రోటీన్‌తో కూడిన ఆహారం తీసుకోవాలి. వర్షాకాలంలో వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి పరిశుభ్రతతోపాటు సరిపడా నిద్ర, వ్యాయామం, మంచి ఆహారం అవసరం. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. చిరుతిళ్లు తినకూడదు. ముఖ్యంగా ఫ్రిడ్జ్‌లో పెట్టిన ఆహార పదార్థాలు తినడం తగ్గించుకోవాలి. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ అనిత, వైద్యాధికారి, ఆరిలోవ ఎఫ్‌ఆర్‌యూ

ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం



వర్షాకాలంలో సీజనల్‌గా వ్యాపించే మలేరియా, డయేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. ముందు జాగ్రత్తగా వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. ఎలాంటి ప్రాంతాల్లో జ్వరాలు ప్రబలడానికి అవకాశం ఉందో పరిశీలిస్తున్నాం. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాం. ఎక్కువగా హాస్టళ్ల నుంచి పాఠశాల, అరకు తదితర ప్రాంతాల్లోని ఇళ్లకు వెళ్లి తిరిగి వచ్చే విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నట్లు గుర్తించాం. అక్కడి వాతావరణ పరిస్థితుల్లో విద్యార్థులు వ్యాధులకు గురై ఇక్కడకు రావడంతో ఇతరులకు కూడా అవి వ్యాపిస్తున్నట్లు గుర్తించాం. వాటి వ్యాప్తిని అడ్డుకునేందుకు చర్యలు చేపడుతున్నాం.

– డాక్టర్ కిశోర్‌కుమార్, ఏఎంహెచ్‌వో, జోన్ – 2

పరిశోధన పత్రాల సంకలనం ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, ప్రేమానందం తదితరులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రోల్ అండ్ రిలయన్స్ ఆఫ్ ది ఫెడరల్ బాడీస్ ఇన్ రూరల్ లోకల్ గవర్నమెంట్ అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు సంబంధించిన పరిశోధన పత్రాల సంకలనంగా తీర్చిదిద్దిన ప్రత్యేక సంచికను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధికి దోహదపడే అంశాలపై ఎంతో విలువైన పరిశోధన పత్రాలను పుస్తక రూపంలో తీసుకొచ్చిన విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందంను అభినందించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ సమగ్రత పుస్తకాలను ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న పరిపాలన వ్యవస్థలకు నష్టం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతంలో పరిపాలనకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చడం ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని సాధించవచ్చని చెప్పారు. విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం మాట్లాడుతూ సోషల్ సైన్స్ రంగంలో పరిశోధనలు అంతర్జాతీయ ప్రమాణాలతో జరగాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వాలు ఈ దిశగా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏయూ మాజీ వీసీ ఆచార్య నాగేశ్వరరావు

విశాఖ సిటీ: ఆపోహలు వీడి అవకాశమున్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఏయూ మాజీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు సూచించారు. ఏయూ కెమిస్ట్రీ విభాగంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మహారాణిపేట శాఖ నిర్వాహకులు శివలీల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య నాగేశ్వరరావు మాట్లాడుతూ యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు మాట్లాడుతూ దేశంలో ప్రతిరోజూ వేలాది ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాగే నిముషానికి 232 మంది క్యాన్సర్‌తో మృత్యువాత పడుతున్నారని, వీరందరికీ రక్తం ఎంతో అవసరమన్నారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ నిరంతరం సమాజం కోసం పాటుపడే బ్రహ్మకుమారీస్ రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ వైద్యులు దేవేష్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బీకే రామేశ్వరి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలను ఆర్థికంగా కుదేలు చేసిన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు



కరపత్రాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, నాయకులు

మద్దిలపాలెం: ఆచరణ సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను ఆర్థికంగా కుదేలు చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆరోపించారు. జీవీఎంసీ 23వ వార్డు ప్రియదర్శిని కాలనీలో శనివారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమంలో కె.కె.రాజు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు పాలనలో మోసాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. అనంతరం కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజలు చాలా ఆర్థికంగా వెనుకబడిపోయారన్నారు. చంద్రబాబు మోసాలు గ్రహించిన ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం మొల్లి అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో విద్యా రంగం, వైద్యం, వ్యవసాయం తదితర అన్ని రంగాలూ నిర్వీర్యమయ్యాయన్నారు. కూటమి నాయకులు ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బోను రమణారెడ్డి, ఇన్‌చార్జి పులగం సూర్యనారాయణరెడ్డి, పరిశీలకుడు బోర కుమార్ రెడ్డి, పులగం శ్రీనివాస్ రెడ్డి, పిలక మధుసూదన్ రెడ్డి, ఎండెల్లి ఈశ్వర్ రెడ్డి, బోయి శ్రీనివాస్ రెడ్డి, ఎరుసు అరుణ, గుడ్ల శ్రీనివాస్ రెడ్డి, బోయి రమణారెడ్డి పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి శ్రీకృష్ణాపురం గురుకులంలో విద్యార్థులకు శనివారం వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో ఇక్కడి విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో పరిశుభ్రత పాటించాలన్నారు. మంచి ఆహారం తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం హోమియో మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇక్కడి విద్యార్థులకు వక్తృత్వం పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ రత్నవల్లి, హోమియో ఆస్పత్రి హెడ్ సూపర్‌వైజర్ డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

- జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి ఆరిలోవలో శనివారం సీజనల్ వ్యాధులు, పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. మలేరియా, కానిటీ సిబ్బంది నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ కెల్ల సునీత పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోకపోతే దోమలు వృద్ధి చెంది, మలేరియా, డెంగ్యూ రావడానికి అవకాశం ఉంటుందన్నారు.

చిట్టి చేతులతో మృణ్మయ గణపతులు



గణపతి మట్టి ప్రతిమలతో చిన్నారులు

ఏయూ క్యాంపస్: పర్యావరణ పరిరక్షణపై చిన్నారుల్లో స్పృహ పెంపొందిస్తూ బీచ్‌రోడ్డులోని ఎ.ఎల్.బి.టి పాఠశాలలో మృణ్మయ గణపతులను తయారు చేసే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తొలి పూజలందుకునే గణపతి విగ్రహాలను పాఠశాలకు చెందిన 200 మంది విద్యార్థులు తమ చేతులతో స్వయంగా తీర్చిదిద్దారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం నిపుణులు విగ్రహాల తయారీపై విద్యార్థులకు ముందుగా అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధవాణి, గాయత్రి విద్యా పరిషత్ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.దక్షిణామూర్తి, కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు, డి.వి.ఎస్ కామేశ్వరరావు పర్యవేక్షించారు.

మోసాలతోనే చంద్రబాబు గద్దెనెక్కారు

వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



పన్నెండో వార్డు కొండవాలులో కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పదమూడో వార్డులో వృద్ధుడికి కరపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



19వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మొల్లి అప్పారావు, నాయకులు



భానునగర్‌లో కరపత్రాలు అందిస్తున్న నాయకులు

ఎంవీపీ కాలనీ: సార్వత్రిక ఎన్నికల్లో మోసాలకు పాల్పడి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గద్దెనెక్కారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపించారు. జీవీఎంసీ 19వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. చంద్రబాబు దుర్మార్గపు పాలన అంతమొందించడంలో మహిళలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ 19వ వార్డు అధ్యక్షుడు సూరాడ తాతా, వార్డు పరిశీలకుడు బొడ్డు ఉమామహేశ్వరరావు, మహిళ విభాగం అధ్యక్షురాలు శిరీష, సూరాడ వెంకటలక్ష్మి, వాడమొదలు గణేష్, వసంత, అనూష, సత్యరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు భానునగర్‌లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం శనివారం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బొల్లింగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ వేమూరి చంటి, పీతల అప్పారావు, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు నగిరెడ్డి పోలిరెడ్డి, మహిళ విభాగం అధ్యక్షురాలు ఒమ్మి పోలారత్నం, యూత్ అధ్యక్షుడు కొంగరాపు రాంబాబు, మీసాల ప్రదీప్, సంధ్య, పార్వతి, వెంకటలక్ష్మి, తులసి, పావని, వేణుగోపాలరెడ్డి, బమ్మిడి జోగారావు పాల్గొన్నారు.

ఆరిలోవ: జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి చినగదిలి కొండవాలు రాధాకృష్ణనగర్‌లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలు వివరిస్తూ కరపత్రాలు అందించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వదిలేశారని తెలిపారు. కార్యక్రమంలో మొల్లి హేమంత్, బండం శ్రీను, సూర్యారావు, మోళి, వినోద్, జేమ్స్, లోకేష్ పాల్గొన్నారు.

- జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి ఆరిలోవ కాలనీలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ వరిశీలకుడు శ్రీనివాస్, బేతా దుర్గారావు, ప్రసంగి వాసు, కాకర గోవింద్, వంకర బాబూరావు, గంగారావు, రామారావు, కామేశ్వరరావు, రాము, సూరిబాబు, బంగార్రాజు, శ్రీను పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్యానికి చర్యలు

మద్దిలపాలెం: ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ల ఆధ్వర్యంలో అన్ని బస్ స్టేషన్లలో స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించామని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. ఇందులో భాగంగా విశాఖపట్నం డిపో, మద్దిలపాలెం డిపోలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో గల ప్రతి డిపో, గ్యారేజ్, బస్సు స్టేషన్లలో డ్రైవ్ క్లీనింగ్ చేపట్టామన్నారు. ఉద్యోగుల వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. డిపో మేనేజర్ గంగారావు, శ్రీ సుదర్శన్, ప్రశాంతి పాల్గొన్నారు.

ఆర్థిక అంశాలపై అవగాహన అవసరం

విశాఖ విద్య: ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఆఫీస్ ఆఫ్ ది ఆర్బీఐ, అంబుడ్స్‌మెన్ సంయుక్తంగా ఫిక్షనల్ అవేర్నెస్ అన్ అంబుడ్స్‌మెన్ స్కీమ్స్ – 2021 అనే అంశంపై పీటర్ డెక్కర్ స్యార్ సెమినార్ హాల్లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ సింగాల సుబ్బయ్య మాట్లాడుతూ ఆర్థిక సమ్మేళనం, ఆర్థిక సాక్షరత, వినియోగదారుల రక్షణ స్థిరమైన అభివృద్ధికి పునాదులన్నారు. ప్రొఫెసర్ జాలాది రవి పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంతో ఆవిష్కరణలు సాధ్యం

ఎంవీపీ కాలనీ: నూతన విద్యావిధానంతో విద్యార్థుల్లో నైపుణ్యం, ఆవిష్కరణలు సాధ్యమవుతాయని ఏపీఆర్‌ఎస్‌ఏ కార్యదర్శి జి.బుచ్చి అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఐఎఎంఎస్ ఎన్ఈపీ – 2020పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ – 2020 ద్వారా దేశవ్యాప్తంగా విద్యావిధానంలో పలు కీలక మార్పులు రానున్నట్లు తెలిపారు. జాతీయ విద్యావిధానాన్ని అన్ని రాష్ట్రాలు అమలులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ నూతన సాంకేతిక విధానంపై యువత అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతిభకు డిగ్రీలు ఒక్కటే కొలమానం అనే భావన వదలాలని సూచించారు. చదువుతో పాటు నైపుణ్యం, ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. ఆచార్య అవధాని, ఆచార్య పల్లవి మాట్లాడుతూ ఆవిష్కరణలు, సృజనాత్మకతతో విద్యార్థులు ముందడుగు వేస్తున్నారన్నారు. ఏయూ వీసీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్, ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, ఆచార్య పల్లవి అతిథులను సత్కరించారు.

జాబ్‌మేళాకు భారీ స్పందన

ఎంవీపీకాలనీ: డేటా ప్రో కంప్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఎంవీపీ కాలనీ సెక్టార్–3లోని సంస్థ కార్యాలయంలో శనివారం ఈ మేళా జరిగింది. ఈ సందర్భంగా సెంటర్ మేనేజర్ రవి మాట్లాడుతూ డేటా ప్రో సంస్థ నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్‌ఎస్‌డీసీ) భాగస్వామ్యంతో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళాకు నగరంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల నుంచి 1,200 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోగా, 800 మంది హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, బీటా మాంక్స్, ఆల్ హెల్తండ్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్, కాన్సెంట్రిక్స్, టాటా ఎలక్ట్రానిక్స్, థాయ్ ల్యాబ్స్, సుదర్శన సొల్యూషన్స్ ఎల్‌ఎల్‌పీ వంటి ఎనిమిది ప్రముఖ సంస్థలు పాల్గొన్నాయి. ఈ కంపెనీల్లో మొత్తం 400 ఉద్యోగాల కోసం ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.22,000 జీతం అందజేయనున్నట్లు మేనేజర్ వివరించారు. ఈ కార్యక్రమంలో పలు సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

వినాయక ప్రతిమల పంపిణీ



ప్రతిమ అందిస్తున్న మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులో గల సీతమ్మధార శ్రీముఖ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద గోదావరి రెడ్డి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సుబ్బిరెడ్డి, సంఘం అధ్యక్షుడు పి.వి.వి.సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు పులగం సూర్యనారాయణ రెడ్డి, కార్యదర్శి వీర రాఘవరెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఓగిరెడ్డి వెంకటరెడ్డి, పులగం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

